“నాది మరో చిన్న మనవి! నేనీనాడు ఇలా పందుల ఫారాన్ని ఓపెనింగ్ చేశానంటే దాని ఎనకమాల పెద్ద కోరిక వుంది. అదేంటంటే వచ్చే ఎన్నికల్లో పందుల్ని పెంచేవారంతా మా పార్టీకే ఓటెయ్యాల! జై హింద్”

అందరూ మళ్ళీ చప్పట్లు కొట్టారు.

మినిస్టర్ మిన్నారావ్ ఎల్లయ్య దగ్గర శలవు తీసుకుని వెళ్ళడానికి హడావుడిగా సిద్దపడే సమయంలో అతని చుట్టూ ఆటోగ్రాఫ్స్ తీస్కోడానికి జనం మూగారు.

“నేనిట్టా ఆటోగ్రాఫ్‌లు ఇస్తా కూకుంటే పెబుత్వం అగిపోద్ది. అయినా మీ అభిమానాన్ని కూడా కాదన్లేనుకదా!” ఇకిలిస్తూ అని అందరికీ ఆటోగ్రాఫ్‌లు ఇవ్వడం
మొదలుపెట్టాడు.

ఆయిదు నిముషాలు గడిచాయ్. ఆటోగ్రాఫ్‌ల కార్యక్రమం అయిపోయింది. చివరగా ఓ వ్య క్తి అతని దగ్గరకి వచ్చాడు.

“ఊ.... త్వరగా ఓ కాయితం ముక్క ఇటిచ్చేయ్. సంతకం పెట్టేస్తా. అవతలు పెబుత్వం ఆగిపోద్ది!” అన్నాడు మినిస్టర్ మిన్నారావ్ ఆ వ్య క్తితో.

“నేను అటోగ్రాఫ్ కోసం రాలేదండీ” ఆన్నాడు ఆ వ్య క్తి.

“మరి?”

అతను చేతిలోని బ్యాగ్‌లోంచి ఓ న్యూస్ పేపరుతీసి మినిస్టర్ మిన్నారావ్‌కి చూపిస్తూ “ఇది చూడండి” అన్నాడు.

“ఏటీ? ఇప్పుడే ఓపెనింగ్స్ సేస్తే అప్పుడె పేపర్లో వచ్చేసిందా.... హహహ....” తన జోక్‌కి తనే గొల్లున నవ్వేశాడు మినిస్టర్ మిన్నారావ్.

“ఇది పాత న్యూస్ పేపరు సార్”

మినిస్టర్ మిన్నారావ్ మొహలో నవ్వు మాయమైంది. అతను ఆ వ్య క్తి వంక అనుమానంగా చూస్తూ ఆ న్యూస్ పేపరుని అందుకుని దాన్ని చూస్తూ నే అదిరిపడ్డాడు.

అది రాజేంద్ర హత్య కేసుకు సంబధించిన వార్త పడిన న్యూస్ పేపర్.

“మనం తచ్చనం ఇంటికాడ మాట్లాడుకుందాం పద!” కంగారుగా అన్నాడు మినిస్టర్ మిన్నారావ్ ఆ వ్య క్తితో.

“ఇప్పుడా? ఇప్పుడయితే మీ ప్రభుత్వం అగిపోతుందేమో కద్సార్? రేపు తీరుబడిగా మీ ఇంటికొస్తా సార్!” అన్నాడా వ్య క్తి వినయంగా.

“మరీ అంత వినయం వద్దు. నా మెదడులో నరాలు సిట్లిపోతాయ్! పెబుత్వం అగిపోనీ, కూలిపోనీ.... మనం ఇప్పుడే మాట్లాడాల!” అన్నాడు మిన్నారావ్ పాలిపోయిన మొహంతో.

0 0 0

“కూకో..... కూకో” గదిలోని సోఫాలో భుజాలు పట్టి నొక్కి ఆ వ్య క్తిని కూర్చోపెట్టి, గబగబ వెళ్ళి గది తలుపులు లోపలి నుండి గడియపెట్టొచ్చి ఆ వ్య క్తి కాళ్ళ దగ్గర నేలమీద

కూర్చున్నాడు మినిస్టరు మిన్నారావ్. ఆ వ్యక్తి కంగారు పడిపోయాడు.

"అరెరె ... అదేంటి సార్ ... మీరు నేలమీద కూర్చోడం ఏంటి? పైన కూర్చోండి సార్"

"వద్దు... మెదడు నరాలు చిట్లిపోతాయ్. ఇంతకీ నీకేటి కావాల?"

ఆ వ్యక్తి చాలా అశ్చర్యపోయాడు. అర్రె.... ఆ న్యూస్ పేపర్ చూపించగానే వేరుముక్కవానిన చూసిన పాములా ఎలా లొంగిపోయాడు? ఆ పేపర్లో రహస్యం ఏంటో?

ఆలోచనలో పడిపోయాడు ఆ వ్యక్తి.

"సెప్పు బాబూ.. త్వరగా సెప్పు నరాలు సిట్లిపోతున్నాయి"

"ప్రమోషన్! నేను పనిచేసే అఫీసులోనే పై పోస్టుకి ప్రమోషన్ కోసం అందరితో పాటు నన్నూ ఇంటర్వ్యూకి పిలిచారు. నేను సెలెక్ట్ అయ్యేలా చూడాలి!"

"అట్టాగే..నువ్వే ఆఫీసులో పని చేస్తున్నావో, ఆ ప్రమోషన్ వివరాలేంటో చెప్పు!"

అతను వివరాలు రాసి వుంచిన స్లిప్ జేబులోంచి తీసి మినిస్టరు మిన్నారావుకి ఇచ్చాడు.

ఆ స్లిప్పుని చదివి "నీకు ప్రమోషన్ వచ్చినట్టే ఫో" అన్నాడు.

"థాంక్యూ సార్" అంటూ ఆ వ్యక్తి సోఫాలోంచి లేచి గది తలుపులదాకా వెళ్ళి గడియ తీసాడు.

"ఇంతకీ నిన్ను ఇక్కడికి ఆ న్యూస్ పేపరుతో పంపించింది ఎవరు?" అక్కడే నేలమీద కూర్చునే అడిగాడు మిన్నారావు.

" ఏకాంబరం! మీరు విజయవాడకి ట్రాన్స్ఫర్ చేయించారే... ఆయన! మాకు దూరపు బంధువుతాడు.. వస్తాన్ సార్"

ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

వీడిని పంపినవాడు ఏకాంబరం!

వాడిని పంపినవాడు బుచ్చిబాబు!

"ఒరేయ్ బుచ్చిబాబూ! ఎంత పని సేశావ్రా"

బాధగా జుట్టు పీక్కున్నాడు మినిస్టరు మిన్నారావు.

0 0 0

"జయ్య్య్....."

బుచ్చిబాబు పెట్టిన చారు తాళింపు పెద్దగా శబ్దం చేసింది. అంతకంటే పెద్దగా శబ్దం చేస్తూ బుచ్చిబాబు డజన్ తుమ్ములు తుమ్మాడు ఆ తాళింపు ఘాటుకి.

"నాకైతే ఇన్ని తుమ్ములు వస్తున్నాయి. ఈ ఆడవాళ్ళు దగ్గకుండా తుమ్మకుండా వంటెలా చేస్తారబ్బా!" అనుకున్నాడు బుచ్చిబాబు .

చారు దించేలోగా ప్రక్క స్టవ్ మీద అన్నం కుతకుత ఉడికి పోతూ తెర్లిపోతోంది.

"సీతా.... సీతా ...." గావుకేకలు పెట్టాడూ బుచ్చిబాబు .

“ఏంటి?” వంటింటి గుమ్మం దగ్గరకొచ్చి చాలా  క్యాజువల్‌గ అడిగింది సీత .

“నువ్వు కాస్త ఈ అన్నం సంగతి చూడు. నేను చారు సంగతి చూస్తాను” అన్నాడు బుచ్చిబాబు గరిటతో అన్నం కలియబెడ్తూ.

“ఏం? నేను వంట చేస్తున్నప్పుడు నీ హెల్ప్ ఏమైనా అడిగానా నేనైతే ఒక్కదాన్నే ఒక ప్రక్కన చారు మరుగుతూ మరో ప్రక్క అన్నం ఉడుకుతూ వున్నా, కూరగాయలు కూడా తరిగేదాన్ని. నీ ఆదర్శాల కోసం కాసింత కష్టపడితే తప్పేంలేదు. మీ సుందర్ అమెరికాలో అతని జూలీ చెప్పులు కూడా పాలిష్ చేస్తాడాని చెప్పాడుగా! మర్చిపోయావా?” వ్యంగ్యంగా అనేసి అక్కడి నుండి హాల్లోకి వెళ్ళిపోయింది సీత .

బుచ్చిబాబు అన్నం కలుపుతున్న గరిటతో కసిగా నెత్తన ఠంగ్ మంటూ కొట్టుకున్నాడు. మళ్ళీ బాధగా హబ్బ అనుకున్నాడు.

అతను గరిటతో బుర్రమీద కొట్టుకున్నప్పుడు సరిగ్గా ఏ నరం మీద దెబ్బ తగిలిందోగానీ అతని బుర్రలో బల్బులా ఓ ఆలోచన వెలిగింది.

“అవునూ ఆదర్శం, ఆదర్శం అంటూ వంటపనీ, ఇంటిపనీ అన్నీ చేస్తున్నాగానీ అసలు నేనే ఆదర్శం కోసమ ఈ పనులన్నీ చేస్తున్నాను? పెళ్ళి కాకుండా సీతతో కాపురం చెయ్యడానికి! వంటపని తకీమని మొదలయిందిగానీ సీతతో కాపురం మొదలయిందా? కాపురం దాకా ఎందుకు? కనీసం ఒక్కసారైనా తృప్తిగా ముద్దుపెట్టుకోనిచ్చిందా? హమ్మ సీతా... తెలివైనదానివే!” అనుకున్నాడు బుచ్చిబాబు .

అప్పుడే సుందర్ తనతో అన్న మాటలు బుచ్చిబాబుకి గుర్తుకు వచ్చాయి.

“మగవాడివలె బ్రతుకుము.. ఫోర్స్ ఉపయోగింపుము”

యస్! నేను మగాడిని! సీత చెప్పిదానికి చెవలాయ్‌లా తలూపుతూ ఉపయోగంలేని పనులు చెయ్యడం శుద్ధ దండగ.   ఈ రాత్రి సీత సంగతి చూడాల్సిందే!

అలోచనల్లో మునిగి ఉన్న బుచ్చిబాబు ముక్కు పుటాలకి గ్యాస్ వాసిన సోకి స్పృహలోకి వచ్చి కంగారుగా స్టవ్ వంక చూసాడు.

అన్నం ఎప్పుడు పొంగిపోయిందో గానీ స్టవ్ అరిపోయి ఉంది.

బుచ్చిబాబు నెత్తి కొట్టుకున్నాడు.

0 0 0

రాత్రి పదకొండు  గంటలయింది.

టీవీలో ఏదో సినిమా చూసి అప్పుడే బుచ్చిబాబు సీత మంచం మీద నడుం వాల్చారు.

ఆ సినిమా చూసిన తరువాత ఆ ఇద్దరి మనసుల్లో ఎంతో అలజడి చెలరేగింది.

కారణం ... ఆ సినిమలో హీరో, హిరోయిన్ మధ్యన ఇంటిమేట్ సీన్సు రెచ్చగొట్టే విధంగా తీసాడు డైరెక్టర్. బుచ్చిబాబు, సీతా ఎంతో కదిలిపోయారు.

కానీ...

ఇద్దరూ మౌనంగా ఎంతో గంభీరంగా మొహంపెట్టి ఆ సినిమా చూశారు.

సినిమా అయిపోయాక టీవీ కట్టేస్తూ "ఏంటోలే చెత్త సినిమా?" అంది సీత.

ఆమె అలా అన్నా కూడా ఆమెకి ఆ సినిమా నచ్చిందని బుచ్చిబాబుకి తెలుసు. అది బుచ్చిబాబుకి తెలుసున్న విషయం సీతకు తెలుసు! ఇది మనసులు ఆడే దొంగాట!

బుచ్చిబాబు ప్రక్కకి తిరిగి సీత వంక చూసాడు. గాఢంగా నిద్రపోతున్నట్టు నటిస్తూ పడుకుంది. ఆమె నిద్రపోవడం లేదని బుచ్చిబాబుకి తెలుసు. ఆ విషయం బుచ్చిబాబుకి తెలుసని సీతకి కూడా తెలుసు!

మళ్ళీ మనసుల దొంగాట. ఆ సమయంలో బుచ్చిబాబు హృదయంలో సుందర్ మాటలు ప్రతిధ్వనించాయి.

"మగవాడి వలె బ్రతుకుము...ఫోర్స్ ఉపయోగింషుము"

అవును.....నేను మగవాడిలా బతకాలి! సీతకి వండి పెట్టడానికా నేను హైదరాబాద్ నుండి ట్రాన్సుపరు చేయించుకుని ఇంత దూరం వచ్చింది? అనుకున్నాడు.

బుచ్చిబాబు ప్రక్కకి తిరిగి సీత నడుం మీద చెయ్యేశాడు.

సీత కదల్లేదు మెదల్లేదు. కొన్ని క్షణాలు భారంగా గడిచాయ్. ఈసారి బుచ్చిబాబు సీత భుజం మీద చెయ్యేసి తనవైపుకి తిప్పుకున్నాడు. సీత అతనివైపు ఈజీగానే తిరిగిపోయింది.

ఆమె కళ్ళు మూస్కునే వుంది.

బుచ్చిబాబు ఆమె పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె కళ్ళూ తెరవలేదు. బుచ్చిబాబు ఆమెని గాఢంగా కౌగలించుకున్నాడు. అతనిలో ఆవేశం కదలిలోని మహోత్తుంగ తరంగంలా ఎగిసి పడింది.

బుచ్చిబాబు ఇంక ఆగలేకపోయాడు.

కానీ......

అదే సమయంలో సీత చేతులు బుచ్చిబాబుని బలంగా వెనక్కితోశాయి. ఆమె కళ్ళు తెరిచి చూసింది. అ కళ్ళల్లో భావం బుచ్చిబాబుకి అర్థంకాలేదు. కానీ బుచ్చిబాబు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

బాధవల్లా? కాదు!

ఉక్రోషంవల్లా? కానేకాదు.

విరహాన్ని తట్టుకోలేక ఆ కన్నీళ్ళు.

"ప్లీజ్ నన్ను కాదనకు!" అతని గొంతులో జీర!

సీత బుచ్చిబాబు గుండెల్లో తల దాచుకుంది.

బుచ్చిబాబు మళ్ళీ చనువు తీసుకున్నాడు.

సీత బుచ్చిబాబుకి లొంగిపోయింది.

ఆమె అతనికి లొంగిపోవడానికి ఇష్టపడింది కనుకనే అతనికి లొంగిపోయింది.

పూర్తిగా....

0 0 0

బుచ్చిబాబు హడావిడిగా బూట్లు వేస్కుని అఫీసుకు బయలుదేరాడు.

"మరి నేను వెళ్ళిరానా?" అంటూ సీతని దగ్గరకు తీసుకుని బుగ్గ మీద ముద్దుపెట్టుకున్నాడు బుచ్చిబాబు .

"ఊ" అంది సీత.

"ఊ అనగానే సరిపోదు. నువ్వుకూడా నా బుగ్గమీద ముద్దుపెట్టాలి మరి!" మారాం చేస్తూ అన్నాడు బుచ్చిబాబు .

రాత్రి జరిగిన ఇన్సిడెంట్‌తో బుచ్చిబాబుకి చాలా కాన్ఫిడెన్స్ , ధైర్యం వచ్చేసాయి. తన జీవితం సెటిలైపోయినట్టే అనిపించింది అతనికి.

అతని మొహంలో విజయగర్వం తొణికిసలాడుతూ వుంది.

సీత బుచ్చిబాబు బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

"థాంక్యూ"! అంటూ గుమ్మం వైపు ఆడుగులు వేసాడు బుచ్చిబాబు .

"బుచ్చీ!" వెనుకనుండి సీత పిలిచింది.

బుచ్చిబాబు వెనక్కి తిరిగి చూసాడు.

"సాయంత్రం ఇంటికి త్వరగా వచ్చేస్తావుగా?" అడిగింది.

బుచ్చిబాబుకి ఎంతో సంబరం అయిపోయింది.

"అబ్బో...... అబ్బో ......అప్పుడే ఎంత కన్సర్న్ చూపిస్తోందో!" అనుకున్నాడు.

"ఓ అలాగే....." అన్నాడు.

నిజానికి రాత్రి జరిగినదానికి ఎంతో ప్రేమ మైకం కమ్మేసి విరహంతో వేగలేక బుచ్చిబాబు త్వరగా రమ్మని అడగడంలేదు సీత. ఒక్కత్తే ఇంట్లో వుంది బోర్‌కొడుతూ త్వరగారమ్మని అంది. నిజానికి ఉద్యోగం చేసే ఆడవాళ్ళు సెలవు పెట్టి ఇంట్లో కూర్చోలేదు.

అదీ సీతలా మరి ఇంత లాంగ్‌లీవ్ పెట్టి ఇంట్లోకూర్చోవాలంటే ఎవరి వల్ల కాదు.

"బుచ్చీ....." వీధి తలుపులు వేసుకుని బయటికి వెళ్ళబోతున్న బుచ్చిబాబుని మళ్ళీ పిలిచింది సీత .

"మళ్ళీ ఏంటి" అడిగాడు బుచ్చిబాబు ."మీ ఆఫీసులో నాగురించి చెప్పావా అసలు."

బుచ్చిబాబు ఆశ్చర్యంగా సీతవంక చూసాడు.

"అప్పుడు హఠాత్తుగా ఆ విషయం ఎందుకడుగుతున్నావు?" "ఆడిగే అవసరం కలిగింది కనుకనే అడుగుతున్నాను. రాత్రి నువ్వు చేసిన పనీ నిన్నీ ప్రశ్నని అడిగిస్తుంది"

బుచ్చిబాబు తేలిగ్గా నవ్వేశాడు. "ఓ....అదా నీ భయం? నేనెవరికీ చెప్పనులే...నువ్వేం భయపడకు"

"నాకేం భయంలేదు! నువ్వు ఎవరికీ చెప్పకపోవడంకాదు......" అందరికీ చెప్పడమే నాక్కావాలి?" ఒక్కో పదాన్ని పట్టి పట్టి అంది సీత .

బుచ్చిబాబు తెల్లమొహం వేసుకుని సీతవంక చూసాడు. రెండు క్షణల తరువాత తేరుకుని ఇలా అన్నాడు "ఆఫీసులో నీ గురించి చెప్పడానికి సందర్భం అంటూ రావాలికదా!"

"సందర్భం వచ్చినప్పుడు నా గురించి ఏం చెప్తావ్" నిలదీసి అడిగింది సీత .

"ఆ టైంరానీ...అప్పుడు చూద్దాం!"

"అంటే నా గురించి ఏం చెప్పాలన్నది నువ్వు నిర్ణయించుకోలేదా? నీకు మనమున్న సిచ్యుయేషన్ గురించి అభిప్రాయం ఏమీలేదా? కనీసం నీ మోహన్‌తో ఆ సందర్భం వచ్చివుండాలే....మరి మోహన్‌కి నా గురించి ఏమని చెప్పావ్?"

"ఏమీ చెప్పలేదు"

"మోహన్ నేను నువ్వు తాళికట్టిన భార్యనని అనుకుంటున్నాడు. అతను అలా అనుకుంటే అనుకోనివ్వమని నువ్వనుకున్నావు కన్వీనియంట్‌గా. అంతే గానీ సీత
నా భార్య కాదు అని చెప్పావా?"

"అలా పనిగట్టుకుని చెప్తే నీ కిష్టం లేదేమోనని......" గొణిగాడు బుచ్చిబాబు.

"పెళ్ళికాకుండా అది ఇష్టం లేదు. కానీ నిన్నరాత్రి నువ్వాగావా?" అతని మొహంలో సూటిగా చూస్తూ ప్రశ్నించింది సీత.

బుచ్చిబాబు ఏం సమాధానం చెప్పకుండా మౌనంగా వుండిపోయాడు.

"నాతో అ పని చెయ్యడానికి నీకు ధైర్యం అక్కర్లేదు. కానీ పెళ్ళి చేసుకోకుండా నాతో కాపురం పెట్టానని అందరికి చెప్పడానికి నీకు ధైర్యం కావాలి. అది
నీకు లేదు. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టు సుందర్‌ని చూసి నువ్వు....."

"నాకెందుకు ధైర్యంలేదు. ఉంది" ఆమె మాటలకు ఆడ్డు తగులుతూ అన్నాడు బుచ్చిబాబు.

"నీకు ముమ్మాటికీ ధైర్యం లేదు. ఏదో ముందు తరాలవారికి ఆదర్శం కావాలనీ, ప్రేమైక సామ్రాజ్యం నిర్మించాలనీ అనుకుంటున్నావుగానీ దానికి చాలా గుండె ధైర్యం కావాలి?"

"నాకా ధైర్యం వుంది!"

"అలాగయితే మన రిలేషన్ గురించి అందరికీ ధైర్యంగా చెప్పు.......ఆ తరువాత ఎదురయ్యే పరిస్థితుల్ని కూడ ధైర్యంగా ఎదుర్కో....... అప్పుడు నిన్ను నేను మెచ్చుకుంటా" ఖచ్చితంగా కుండ బద్దలు కొట్టినట్లుగా చెప్పింది సీత .

*　　　　　　*　　　　　　*

ఆ రోజు నిద్ర లేవగానే బుచ్చిబాబు చాలా హుషారుగా వున్నాడుగానీ సీత అతనిమీద చల్లగా నీళ్ళు కుమ్మరించేసింది.